సాక్షి జగిత్యాల
శనివారం, 8, జూలై, 2023



వెంకన్నకు క్షీరాభిషేకం

ధర్మపురి: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామికి శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



చెక్కులు అందజేత

ధర్మపురి: స్థానిక పీఏసీఎస్ ద్వారా మంజూరైన రూ.17లక్షలచెక్కులను డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి రైతులకు అందజేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/25.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జీపీఎఫ్ ఖాతాల బదలాయింపు



సర్టిఫికెట్లు అందిస్తున్న దావ వసంత

జగిత్యాలజోన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ జీపీఎఫ్ ఖాతాల బదలాయింపు వేగవంతంగా సాగుతోందని జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత చెప్పారు. జెడ్పీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మోతె, చిన్నమెట్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమం అండర్ టేకింగ్ సర్టిఫికెట్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ఆనందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

10నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

జగిత్యాల: పఠనోత్సవంలో భాగంగా ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం సూచించారు. 10న పిల్లలతో పుస్తక పఠనం చేయించాలన్నారు. 11న పుస్తక పఠనం ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించాలని, 12, 13 తేదీల్లో పుస్తకాలను సేకరించే కార్యక్రమం చేపట్టాలని, పిల్లలకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. 14న విద్యార్థులతో పేపర్ కటింగ్స్, కార్టూన్స్ తయారు చేయించాలన్నారు. 15న తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి తప్పులు లేకుండా పుస్తక పఠనం పోటీలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవం



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

జగిత్యాలటౌన్: స్థానిక పురాణిపేట ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మతల్లి బోనాల పండుగ నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా చేపట్టిన వేడుకలకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ వేడుకల్లో పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, నలుమాచు గంగాధర్, ఆలయ కమిటీ సభ్యుడు గాజుల రాజేందర్, కౌన్సిలర్ ములస్తం లలిత తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురికి రూ.3.12 కోట్లు

ధర్మపురి: వివిధ వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులకు మరో రూ.3,12,40,000 మంజూరైనట్లు మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం తెలిపారు. వివిధ వార్డులు, కుల సంఘ భవనాలు, ప్రధాన కూడళ్ల వద్ద సీసీరోడ్లు, డ్రైనేజీలు, మిషన్ భగీరథ పైపులైన్ల నిర్మాణం తదితర పనులు చేపట్టేందుకు ఈ నిధులు మంజూరయ్యాయని వివరించారు. ఎస్‌డీఎఫ్ గ్రాంటు కింద 35 పనులకు జీవో నంబర్ 378 ద్వారా ఇవి మంజూరైనట్లు మంత్రి కొప్పుల పేర్కొన్నారు.

అమ్మకు ఆపద



సాక్షి ప్రత్యేక కథనం

- నొప్పులు రాక.. ఆరోగ్యం సహకరించక..
- గర్భిణులకు తప్పని సిజేరియన్లు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఆపరేషన్లు
- పౌష్టికాహార లోపమే ప్రధాన కారణం
- ముహూర్తాలని మరికొందరు..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్యులు

జగిత్యాల: మొన్నటిదాకా కాసుల కోసం కక్కుర్తిపడిన కొందరు ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు అవసరం లేకున్నా సిజేరియన్లు చేస్తూ పురుడు పోస్తూ వచ్చారు.. కొందరు దంపతులు, వారి బంధువులు శుభముహూర్తాలంటూ డాక్టర్లపై ఒత్తిడి తెచ్చి తప్పనిసరిగా శస్త్రచికిత్సలతో డెలివరీలు చేయించారు.. దీనిద్వారా మహిళల్లో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, తప్పనిసరైతే తప్ప సిజేరియన్లు చేయొద్దని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ విస్తృతంగా అవగాహన కల్పిస్తూ వచ్చింది.. సర్కారు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. అయినా, ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సిజేరియన్లు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత జూన్‌లో సాధారణ ప్రసవాలు 449 జరిగితే.. సిజేరియన్లు ఏకంగా 288(64శాతం)కు చేరుకోవడంపై వైద్య, ఆరోగ్యశాఖ విస్మయం వ్యక్తం చేస్తోంది. ఎవరెన్ని చెప్పినా, ఎలాంటి ఆదేశాలు జారీచేసినా తాము తగ్గేదేలే.. అన్నట్లు ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ సాధారణ ప్రసవాలు 237 చేస్తే.. సిజేరియన్లు 199(84శాతం) చేయడం గమనార్హం.

లోపం ఎక్కడుంది?

- మాతా శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా మహిళలకు ప్రతినెలా పౌష్టిహారం అందిస్తూ వస్తోంది.
- గర్భం దాల్చినప్పటి నుంచి డెలివరీ అయ్యే వరకూ వారికి వెన్నంటి ఉంటూ వస్తోంది.
- క్రమం తప్పకుండా ఉచితంగానే వైద్య పరీక్షలు చేయిస్తోంది. అవసరమైన మందులు ఉచితంగానే అందిస్తోంది.
- అయినా, గ్రామీణ మహిళలే కాదు.. పట్టణాల్లోనూ కొందరిలో పౌష్టికాహార లోపం ఉందని అధికారులు, వైద్యులు చెబుతున్నారు.
- డెలివరీ సమయంలో ఆరోగ్యం సహకరించడం లేదని, రక్తహీనతతో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరిస్తున్నారు.
- అంతేకాదు.. నిర్దేశిత గడువు ముగిసినా నొప్పులు రాకపోవడం, బీపీ పెరగడం, గుండె వేగంగా కొట్టుకోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సిజేరియన్ చేయాల్సి వస్తోందంటున్నారు.
- మరికొందరు శుభముహూర్తాలు చెబుతూ తమపై ఒత్తిళ్లు తెస్తున్నారని, ఇలాంటి సమయాల్లోనూ శస్త్రచికిత్సలు చేయక తప్పడం లేదంటున్నారు.

వైద్యులు ఏం చెబుతున్నారంటే..

సిజేరియన్‌తో నష్టాలు..

- సిజేరియన్‌తో జన్మించిన శిశువుకు చురుకుదనం తక్కువ
- సిరల్లో రక్తం గడ్డకట్టి, తల్లి ప్రాణానికి హాని
- చనుపాలు ఇవ్వడంలో ఆలస్యం
- గర్భాశయ గోడకు నష్టం
- ఎక్కువ రోజులు ఆస్పత్రిలోనే ఉండాలి
- శస్త్రచికిత్స మచ్చ సమసిపోదు
- రోజువారీ పనులకు ఇబ్బందులు
- తొలికాన్పు సిజేరియన్ అయితే.. రెండోకాన్పులోనూ తప్పని ఆపరేషన్

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలు

నెల	సాధారణ	శాతం	సిజేరియన్	శాతం
ఏప్రిల్	315	43	261	80
మే	282	38	228	81
జూన్	237	34	199	84

సాధారణ కాన్పుతో ప్రయోజనాలు

- శిశువుకు చురుకుదనం ఎక్కువ
- సిరల్లో రక్తం గడ్డకట్టదు
- త్వరగా చనుపాలు ఇవ్వొచ్చు
- గర్భాశయ గోడ సురక్షితంగా ఉంటుంది
- ఆస్పత్రి నుంచి రెండుమూడ్రోజుల్లో డిశ్చార్జి కావొచ్చు
- పొట్టపై మచ్చలు ఉండవు
- త్వరగా రోజువారీ పనులు చేసుకోవచ్చు
- ఎన్ని కాన్పులకైనా అవకాశాలు ఉంటాయి.


పౌష్టికాహార లోపమే..




గ్రామాల్లోనే కాదు.. పట్టణాల్లో కొందరు గర్భిణులు రక్తహీనతతో బాధపడుతూ మా వద్దకు వస్తున్నారు. పౌష్టిహారంతో బాధపడే వారిలో ఇలాంటి సమస్య ఉంటుంది. తద్వారా వీరికి పురుడుపోసేందుకు ఆరోగ్యం సహకరించడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లోనే సిజేరియన్ చేయాల్సి వస్తోంది. మరికొన్ని సందర్భాల్లో తమ అమ్మాయి నొప్పులు తట్టుకోదని, శుభముహూర్తాలని మరికొందరు తల్లిదండ్రులు మాపై ఒత్తిడి తేవడంతో శస్త్ర చికిత్స చేయాల్సి వస్తోంది.

– ఒద్నాల రజిత, గైనకాలజిస్ట్, జగిత్యాల

ఈ ఏడాది ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాలు



ప్రసవాలు శాతంలో..



మంచిర్యాల జిల్లా గూడెం గ్రామానికి చెందిన ఈమె పేరు రేణుక. తొలికాన్పు కోసం ఇటీవల జగిత్యాల మాతా శిశు సంక్షేమ కేంద్రంలో చేరింది. నిర్దేశిత గడువులోగా పురిటినొప్పులు రాలేదని, సిజేరియన్ చేసి పాపకు పురుడు పోశామని డాక్టర్లు చెప్పారు.



నేరెళ్ల గ్రామానికి చెందిన ఈ బాలింత పేరు బండి లలిత. తొలికాన్పు కోసం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. బీపీ ఎక్కువైంది. గుండె వేగంగా కొట్టుకోవడంతో సిజేరియన్ చేసి పురుడు పోసినట్లు వైద్యులు తెలిపారు.



తాళ్లధర్మారం గ్రామానికి చెందిన ఈ మహిళ పేరు గంగాజల. తొలి కాన్పు కోసం జగిత్యాల మాతా శిశు సంక్షేమ కేంద్రంలో చేరగా, అధిక బీపీ ఉందని, హార్ట్‌బీట్ పెరిగిపోతోందని గుర్తించిన వైద్యులు.. వెంటనే సిజేరియన్ చేసి పురుడు పోశారు.



క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం

- జీవో నంబరు 59 లబ్ధిదారులకు నోటీసులు జారీ
- రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ఆదేశాలు
- కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: భూ క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, జీవో నంబరు 59 కింద లబ్ధిదారులకు నోటీసులు జారీచేయాలని, ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జీవో 58 కింద గతంలో 20,668 మంది లబ్ధిదారులకు పట్టాలు ఉచితంగా పంపిణీ చేశామని, ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని రెండు రోజుల్లో పూర్తిచేయాలన్నారు. మిగిలిన వాటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి 15 రోజుల్లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. ధరణి మాడ్యుల్‌లోని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం ధరణిలో కొత్తగా ఐదు మాడ్యుల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణ సవరణలు, ప్రస్తుతం ఉన్న సర్వే నంబర్లను పరిష్కరించాలన్నారు. కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, జీవో నంబరు 58, 59, 76, 118 కింద భూముల క్రమబద్ధీకరణకు అందిన, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతామన్నారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మాధురి పాల్గొన్నారు.

పోస్టల్ బీమా చేయించండి



చెక్కు అందజేస్తున్న అధికారులు

కోరుట్ల: పోస్టల్ సేవలను సద్వినియోగించుకోవాలని పోస్టల్ కరీంనగర్ సూపరింటిండెంట్ పసునూరి ప్రభాకర్ కోరారు. పట్టణానికి చెందిన దొనకంటి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పోస్టల్ బీమా ద్వారా రూ.పది లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేసి మాట్లాడారు. ఏటా రూ.396 చెల్లించి పోస్టల్ బీమా పాలసీ తీసుకుంటే రూ.పది లక్షల పరిహారం అందుతుందన్నారు. ఈనెల 31వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి పాలసీలు చేయిస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఆయాజ్, కౌన్సిలర్ సుజాత పాల్గొన్నారు.

చోరీల నియంత్రణకు పటిష్ట చర్యలు



భరోసా కేంద్రం భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న పోలీసు అధికారులు

- ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: జిల్లాలో తరచూ చోటుచేసుకుంటున్న చోరీల నియంత్రణకు నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని ఎస్పీ భాస్కర్ ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వరుస దొంగతనాల నియంత్రణపై డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పౌరుల ఆస్తులు సురక్షితంగా ఉన్నాయనే భరోసా కల్పించాలన్నారు. చోరీ కేసుల ఛేదన కోసం అన్ని కోణాల్లో విచారణ చేయాలని చెప్పారు. నేరస్తుల ఫొటోలతో ఆల్బమ్ తయారుచేయాలని సూచించారు. బస్టాండ్లు, రద్దీగా అధికంగా ఉండే ప్రాంతాల్లో నిఘా పెంచాలని చెప్పారు. పదేళ్ల నుంచి చోరీలు చేస్తున్న వారిని గుర్తించి జాబితా రూపొందించాలన్నారు. ఇన్ఫార్మర్ వ్యవస్థను రూపొందించుకోవాలని సూచించారు.

మహిళలకు భరోసా కేంద్రాలు

వేధింపులు, అత్యాచారాలు, నిరాధారణకు గురైన మహిళలు, బాలికలకు ఒకేచోట వైద్య, న్యాయ సలహా, కౌన్సెలింగ్, మానసిక మద్దతు ఇచ్చేందుకు ప్రభుత్వం భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని ఎస్పీ భాస్కర్ తెలిపారు. స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో భరోసా కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు.

'బడుగు' వీరులు ఎవరో?

- తొలుత బీసీలకే టికెట్లని కాంగ్రెస్ అధిష్టానం ప్రకటన
- పార్లమెంటు సెగ్మెంటులో ఇద్దరు బీసీలకు అవకాశం
- గంపెడాశాలతో ఉమ్మడి జిల్లాలో ఆశావహులు
- ఎవరిని ప్రకటిస్తారోనని ఉత్కంఠ
- ఆసక్తికరంగా రాజకీయాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు దోహదపడ్డ అంశాలను తెలంగాణలోనూ అమలు చేసేందుకు టీపీసీసీ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే టికెట్ల కేటాయింపులో జనాభా దామాషా ప్రకారం కర్ణాటక మాదిరిగా బీసీ ఫార్ములాను అనుసరించాలని నిర్ణయించింది. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తొలుత బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతల టికెట్లే ప్రకటిస్తామని పునరుద్ఘాటించారు. ఈప్రకటనతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ సామాజిక వర్గంలోని నేతల్లో ఉత్కంఠ నెలకొంది. కర్ణాటకలో అనుసరించిన విధంగానే ప్రతీ పార్లమెంటు సెగ్మెంటుకు ఇద్దరు బీసీలకు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తోంది. పాత జిల్లాలో కరీంనగర్, పెద్దపల్లి తోపాటు నిజామాబాద్ పార్లమెంటు (జగిత్యాల, కోరుట్ల) సెగ్మెంట్లు వస్తాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో మొత్తంగా చూస్తే కేవలం ఐదుగురికి మాత్రమే చోటు దక్కేలా ఉంది. ఈ ఐదాగురిలో ఎవరిని టీపీసీసీ కరుణిస్తుందో అన్న చర్చ మొదలైంది.

వేములవాడ: ఆది శ్రీనివాస్



కాంగ్రెస్ పార్టీ నుంచి కరీంనగర్ పార్లమెంటు బీసీ సామాజిక వర్గం కోటాలో టికెట్ ఆశిస్తున్నవారిలో ముందువరుసలో ఆది శ్రీనివాస్ ఉంటారు. మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన ఆది శ్రీనివాస్ వేములవాడ నుంచి గత 2009, 2010, 2014, 2018 నాలుగు పర్యాయాలు పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇందులో సార్వత్రిక ఎన్నికలు కాగా ఒక ఉప ఎన్నిక ఉంది. ప్రతీసారి విజయం కోసం వీరోచితంగా పోరాడుతున్న ఆది శ్రీనివాస్ ఈసారి ఎలాగైనా విజయం సాధించాలన్న కసితో ఉన్నారు. సుదీర్ఘకాలంగా పోటీ చేస్తుండటం, ప్రజల్లో సానుభూతి, కాంగ్రెస్ పార్టీకి వస్తున్న కొత్త ఊపు తనకు కలిసి వస్తుందని ధీమాగా ఉన్నారు.

కరీంనగర్: పొన్నం ప్రభాకర్



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల్లో పొన్నం ప్రభాకర్ కూడా ఒకరు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నుంచి ఇద్దరు బీసీలకు టికెట్లు ఇవ్వాల్సి వస్తే.. అందులో పొన్నం ప్రభాకర్ కూడా ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. బీసీల్లో బలమైన గౌడ సామాజిక వర్గానికి చెంది ఉండటం, గతంలో ఎంపీ, మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేసి ఉండటం పార్టీలోనూ పలు కీలక పదవులు నిర్వహించిన అనుభవం ప్రభాకర్ సొంతం. కరీంనగర్ అసెంబ్లీ నుంచి పలువురు వ్యాపారవేత్తలు టికెట్లు అడుగుతున్న క్రమంలో ఆయన ఎంపీగా కాంటెస్ట్ చేస్తారా? ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా? అన్న విషయంపై ఇంకా స్పష్టత లేదు.

పెద్దపల్లి: గంటా రాములు యాదవ్



పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో బీసీ కోటాలో టికెట్ ఆశిస్తున్న మరో నాయకుడు గంటా రాములు యాదవ్. టీడీపీ నేతగా ఉమ్మడి జిల్లాలో తనకంటూ గుర్తింపు సాధించుకున్నారు. 22 ఏళ్లుగా ప్రతీసారీ ప్రతిపక్ష పార్టీలో ఉంటూ స్థానిక సంస్థల నుంచి విజయాలు సాధిస్తూ వస్తున్న రికార్డు ఆయన సొంతం. తెలుగుదేశం నుంచి కాంగ్రెస్‌లో చేరిన రాములు.. ఈసారి ఎలాగైనా ఎమ్మెల్యే టికెట్ తనకే వస్తుందన్న ధీమాతో ఉన్నారు. యాదవ సామాజికవర్గానికి చెందిన నేత కావడం, పెద్దపల్లి పార్లమెంటు సెగ్మెంటులో బీసీ కోటాలో తనకు అవకాశం తప్పకుండా దక్కుతుందని పేర్కొంటున్నారు.

రామగుండం: మక్కాన్‌సింగ్ ఠాకూర్..



జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల్లో రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్‌ది ప్రత్యేక స్థానం. 2004 నుంచి 2009 వరకు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడిగా వ్యవహరించారు. ఉమ్మడి రాష్ట్రంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సాప్) చైర్మన్‌గా పనిచేశారు. 2014లో కాంగ్రెస్ రెబెల్‌గా, 2018 కాంగ్రెస్ అభ్యర్థిగా రామగుండం ఎమ్మెల్యే సీటు కోసం పోటీచేశారు. తాజాగా మరోసారి కూడా ఆయన ఇక్కడ నుంచే పోటీకి సిద్ధపడ్డారు. పెద్దపల్లి పార్లమెంటు సెగ్మెంటులో బీసీ కోటా అమలు, పార్టీలో సీనియర్ నాయకుడిగా అనుభవం, రామగుండం స్థానికుడు కావడంతో తనకు టికెట్ గ్యారెంటీ అన్న ధీమాలో ఉన్నారు.

కోరుట్ల: కొమొరెడ్డి కరమ్‌చంద్..



తన తండ్రి మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు కుమారుడు కొమొరెడ్డి కరమ్. ఈయన తనకు కోరుట్ల టికెట్ కావాలని కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం హైకోర్టు, సుప్రీం కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. పార్టీకి తన తండ్రి చేసిన సేవలు, నిజామాబాద్ పార్లమెంటు సెగ్మెంటులో ఇద్దరు బీసీలకు టికెట్ ఇవ్వాల్సి రావడం తనకు కలిసి వస్తాయని ఆశాభావంతో ఉన్నారు. బీసీల్లో బలమైన సామాజికవర్గం అయిన మున్నూరు కాపు కావడం తనకు అదనపుబలంగా భావిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం భోజనం



వినతిపత్రం అందిస్తున్న తల్లులు

సారంగాపూర్(జగిత్యాల): లక్ష్మీదేవిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం నాసిరకంగా ఉందని, కందిపప్పుతో వండిన సాంబారులో తెల్లపురుగులు, లక్కపురుగులు వచ్చాయని బాలింతలు ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేసేందుకు యత్నించగా.. సాంబారులో పురుగులు కనిపించాయి. ఇదేమిటని టీచర్‌ను మహిళలు నిలదీశారు. నిల్వచేసిన పప్పు పుచ్చిపోయిందని, అందులో పురుగులు ఉన్నట్లు గుర్తించారు. ఫొటోలు తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సీడీపీవో వాణిశ్రీ, సూపర్‌వైజర్ లత అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకున్నారు. ఘటనపై విచారణ చేపట్టారు. సర్పంచ్ పాంపర్తి లక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు ఇమామ్ తదితరులు తగిన చర్యలు తీసుకోవాలని సీడీపీవోకు విన్నవించారు. ఆమె రికార్డులు, నిల్వఉన్న బియ్యం, పప్పులు, కోడిగుడ్లు పరిశీలించారు. నిల్వఉన్న పప్పు అంగన్‌వాడీ కేంద్రానిది కాదని, ఇది బయట నుంచి తెచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. అయితే, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ జరపాలని పిల్లల తల్లులు సీడీపీవోకు వినతిపత్రం అందజేశారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీడీపీవో హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల కృషి కారణం

జగిత్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతూ వస్తోందని, ఇందుకు ఉపాధ్యాయుల కృషి కారణమని అదనపు కలెక్టర్ మకరంద్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వివిధ మండలాలకు చెందిన 69 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మన ఊరు.. మన బడి కార్యక్రమం ద్వారా మెజారిటీ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. భవనాలను అన్ని హంగులతో నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ వికాస్ సంయోజక్ సత్యనారాయణరెడ్డి, నవాతు సురేశ్, బోనగిరి దేవయ్య, బోయినపల్లి ప్రసాద్‌రావు, అయిల్నేని నరేందర్‌రావు, వొడ్నాల రాజశేఖర్, గుడిసె పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు వెల్లడి

జగిత్యాల: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు శుక్రవారం వెల్లడైనట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో బాలురలో 1657 మంది పరీక్ష రాయగా 817 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికల్లో 1979 మందికి 1417 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. సెకండ్ ఇయర్‌లో బాలురలో 1380 మందికి గాను 599 మంది, బాలికల్లో 828 మందికి గాను 378 మంది, ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఒకేషనల్ ఫస్ట్ ఇయర్‌లో బాలురలో 427 మందికి గాను 194 మంది, బాలికల్లో 116 మందికి గాను 93 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో బాలురలో 327 మందికి గాను 150 మంది, బాలికల్లో 47 మందికి గాను 29 మంది ఉత్తీర్ణులైనట్లు చెప్పారు.

శిక్ష పడుతుందున్న భయంతో వ్యక్తి ఆత్మహత్య

చొప్పదండి: మండలంలోని కొలిమికుంటకు చెందిన రాగం మహేశ్(32) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహేశ్ గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఏడేళ్ల క్రితం అతను బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో మృతిచెందాడు. కేసు నమోదవడంతో అప్పటినుంచి కోర్టుల చుట్టూ తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో కేసు ట్రయల్‌కు రావడం, శిక్ష పడుతుందని భయాందోళనకు గురయ్యాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి, పడిపోయాడు. నోట్లో నుంచి నురగలు రావడం చూసిన చుట్టుపక్కలవారు కారులో కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

లైంగికంగా వేధించిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట: లైంగిక వేధిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాధాకిషన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన ఓ మహిళను అదే గ్రామానికి చెందిన దగ్గుల ప్రవీణ్ మూడు నెలలుగా లైంగికంగా వేధిస్తున్నాడు. బాధితురాలు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

ఏటీఎంలో చిరిగిన నోటు

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ఇండిక్యాష్ ఏటీఎంలో డబ్బులు విత్ డ్రా చేయగా చిరిగిన నోటు వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన ఏనుగుల పర్శరాములు శుక్రవారం ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేయగా అందులో రూ.500 నోటు సగం వరకు చిరిగిపోయి వచ్చిందని, ఏటీఎంలో నోట్లు ఇలా వస్తే ఎలా ప్రశ్నించాడు. చిరిగిన నోటును ఎవరికి అప్పగించాలో తెలియడం లేదని, ఏటీఎంలో ఇలా చిరిగిన నోట్లు పెట్టి ప్రజలను మోసం చేయవద్దని బాధితుడు కోరుతున్నాడు.

కులవివక్ష లేని సమాజమే లక్ష్యంగా..

- ప్రతినెలా గ్రామాల్లో సివిల్ రైట్స్ డే
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- యథేచ్ఛగా కుల దూషణలు, సాంఘిక బహిష్కరణ
- జనవరి నుంచి ఇప్పటివరకు 60 ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు



జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లిలో అవగాహన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ నవీన్

జగిత్యాలక్రైం: కులవివక్ష లేని సమాజం నిర్మాణం కోసం ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా సమాజంలో కులవివక్ష ఎత్తిచూపడం నేటికీ తగ్గుముఖం పట్టడం లేదు. దీంతో కొందరు ఎస్సీ, ఎస్టీలు కుల వివక్షతకు గురవుతుండటంతో వారు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. వివక్షలేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా అంటరాని తనం నిర్మూలన ధ్యేయంగా అధికార యంత్రాంగం పనిచేస్తోంది. ఇందులో భాగంగా ప్రతినెలా జిల్లాలోని ఒక్కో మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహిస్తున్నా కుల వివక్షత తగ్గడం లేదు. కుల బహిష్కరణ చేయవద్దని పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా కులవివక్ష రూపుమాయడం లేదు. 2023లో జనవరి నుంచి ఇప్పటివరకు 60 ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం.

విచారణ వేగవంతం..

జిల్లాలో కుల దూషణలు, బహిష్కరణలపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే డివిజనల్ స్థాయి పోలీస్ అధికారి విచారణ చేపట్టాలి. బాధ్యులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు సత్వరమే బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వ ఆర్థికసాయం అందించడంతో పాటు, కోర్టులో చార్జీషీట్‌లు దాఖలు చేస్తున్నారు. ఆధునిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నా కులవివక్ష, గ్రామ బహిష్కరణ లాంటి సంఘటనలు చోటుచేసుకోవడం విస్మయం కలిగిస్తోంది.

60 అట్రాసిటీ కేసులు నమోదు..

పౌరహక్కుల చట్టం ప్రకారం హోటళ్లు, ఉద్యానవనాలు, క్రీడారంగాలు, విద్యాలయాలు, వసతి గృహాల్లో జాతి, మతం ఆధారంగా వేరుచేయడాన్ని నిషేధించారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతినెలా చవరిరోజు మండలానికో గ్రామంలో వివిధశాఖల అధికారులు పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా నెలకోసారి 20 గ్రామాల్లో కార్యక్రమం చేపడుతున్నారు.

2019	66
2020	104
2021	111
2022	100
2023లో ఇప్పటివరకు	60

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పర్యటించి ప్రజలతో సమావేశమవుతున్నారు. కుల వివక్ష చూపిస్తూ కించపరుస్తున్నారా? వివిధ అంశాలపై ఆరాతీసి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 60 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు కావడం శోచనీయం. కులవివక్షకు గురైన వారు వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నాం



గ్రామాల్లో సివిల్ రైట్స్ డే ద్వారా పోలీస్, రెవెన్యూ అధికారులతో ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నాం గ్రామస్తుల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. దీంతో గతంలోకన్నా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఇప్పుడు తగ్గాయి. కులం పేరిట దుర్భాషాలాడితే బాధితులు ఫిర్యాదు చేయండి. శాఖాపరంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.– ప్రకాశ్, డీఎస్పీ, జగిత్యాల

ఫిర్యాదు చేయండి



గ్రామాల్లో కుల వివక్ష చూపించినా, గ్రామ బహిష్కరణ చేసినా ప్రజలు నిర్భయంగా అధికారులకు చెప్పవచ్చు. ప్రతినెలా ఓ గ్రామంలో అన్నిశాఖల అధికారుల ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నాం. చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. బాధితులు తమ సమస్యలు ఏమైనా ఉంటే చెప్పుకోవచ్చు. విచారణ జరిపి న్యాయం చేస్తాం.

– నవీన్, తహసీల్దార్, జగిత్యాల రూరల్

అప్పు తీర్చలేననే బెంగతో రైతు ఆత్మహత్య



మల్లేశం(ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): తన చెల్లి వివాహం కోసం తండ్రి చేసిన అప్పు తీర్చే దారిలేదనే బెంగతో రైతు గంగధరి మల్లేశం(24) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం పైడిపెల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పైడిపెల్లి గ్రామానికి గంగధరి భూమయ్య–ప్రమీల దంపతులకు మల్లేశంతోపాటు మరో కూతురు సంతానం. మూడేళ్ల క్రితం కూతురు పెళ్లి చేశారు. ఇందుకోసం తెలిసిన వారి వద్ద రూ.15 లక్షలు అప్పు చేశారు. అయితే, కారణం ఏదో తెలియదు కానీ.. కొద్ది రోజుల క్రితం భూమయ్య మతిస్థిమితం కోల్పోయాడు. అప్పటి నుంచి మల్లేశం తన వ్యవసాయ పొలంలో పంటు పండిస్తూ కుటుంబాన్ని సాకుతూ వస్తున్నాడు. అయితే, ఎంత పనిచేసినా.. ఆశించిన ఆదాయం రాకపోవడం, చెల్లి వివాహానికి చేసిన అప్పు తీర్చే దారిలేకపోవడం, రోజురోజుకూ అప్పు భారంగా మారడంతో మల్లేశం తీవ్రమనస్థాపం చెందాడు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపార

పొలంలోనే శవమయ్యాడు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



రోదిస్తున్న కుటుంబసభ్యులు

- అనుమానాస్పద స్థితిలో రైతు మృతి
- బంధువులే హత్య చేశారంటున్న మృతుడి భార్య
- భూతగాదాలే కారణం?
- శివుపల్లిలో ఘటన

ఎలిగేడు(పెద్దపల్లి): ఓ రైతు తన పొలంలోనే శవమైన ఘటన ఎలిగేడు మండలంలోని శివుపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శివుపల్లికి చెందిన దుగ్యాల హన్మంతరావు మొదటి భార్య లక్ష్మి 35 ఏళ్ల క్రితం మృతిచెందగా సుల్తాన్‌పూర్‌కు చెందిన విజయను రెండో వివాహం చేసుకున్నాడు. కాగా, హన్మంతరావు తనకున్న 6 ఎకరాల వ్యవసాయ భూమిలో మొదటి భార్య కుమారుడు వెంకట్రావు(43)కు 16 ఏళ్ల క్రితం రెండున్నర ఎకరాలు కాగితంపై రాసిచ్చి, మిగతాది తన పేరిటే ఉంచుకున్నాడు. 11 నెలల క్రితం హన్మంతరావు అనారోగ్యంతో మృతిచెందగా అయనకు వారసులు ఎవరూ లేరని రెండో భార్య విజయ తన సమీప బంధువుల సహకారంతో 6 ఎకరాలనూ తన పేరిటే పట్టా చేసుకుంది. దీంతో వెంకట్రావు కోర్టులో పిటిషన్ వేశాడు. ఈ విషయమై పలుమార్లు పంచాయితీలు జరిగాయి. కానీ విజయ పెద్ద మనుషుల మాట వినలేదు.

పొలం నాటు వేయించేందుకు వచ్చి..



వెంకట్రావు (ఫైల్)

వెంకట్రావుకు భార్య సమత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పిల్లల చదువుల కోసం అతను కుటుంబసభ్యులతో కలిసి రెండేళ్లుగా కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. తండ్రి తనకు రాసిచ్చిన రెండున్నర ఎకరాల భూమిని సాగు చేసుకునేందుకు గురువారం శివుపల్లికి వచ్చి, దున్నించాడు. రాత్రి కావడంతో శివుపల్లిలోనే ఉండిపోయాడు. శుక్రవారం ఉదయం పొలం నాటు వేద్దామని, ఉదయాన్నే రమ్మని భార్యకు ఫోన్ చేసి, చెప్పాడు. సమత ఉదయం భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చిన ఆమె తమ పొలం పక్కనున్న రైతు వేల్పూరి రమేశ్‌కు ఫోన్ చేసింది. పొలం వద్ద వెంకట్రావు బైక్ ఉంది.. కానీ అతను కనిపించడం లేదన్నాడు. దీంతో ఆమె ఆందోళనకు గురై, కరీంనగర్ నుంచి హుటాహుటిన శివుపల్లి చేరుకుంది. భర్త కోసం వెతకగా వారి పొలంలోనే శవమై కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సుల్తానాబాద్ సీఐ జగదీశ్, జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు. సమీప బంధువులే హత్య చేశారని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పొలం నాటు వేద్దామని చెప్పిన వెంకట్రావు తెల్లవారేసరికి మృతిచెందడంతో భార్య, కూతుళ్లు రోదించిన తీరు గ్రామస్తులను కంటతడి పెట్టించింది.

ఉపాధ్యాయుడు మందలించాడని..

- బాలిక ఆత్మహత్యా యత్నం..
- ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

కోరుట్ల: ఉపాధ్యాయుడు కులం పేరుతో దూషించి, మందలించాడని ఓ బాలిక ఇంటికి వెళ్లి ఉరేసుకునేందుకు ఆత్మహత్యా యత్నానికి యత్నించింది. ఎస్సై కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం..కోరుట్ల పట్టణంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు రాధాకృష్ణ తొమ్మిదో తరగతి చదువుతున్న తమ కూతురును శుక్రవారం పాఠశాలలో కులం పేరుతో దూషించి మందలించాడని, దీంతో తమ కూతురు ఆత్మహత్య యత్నానికి యత్నించింది. బాలిక తండ్రి పసుల నవీన్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్సై పేర్కొన్నారు.

బాలికను దూషించిన యువకుడి అరెస్ట్

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన బాలికను అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిని అరెస్ట్ చేసి గురువారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. కృష్ణానగర్‌కు చెందిన అమీర్ సోహెల్ అనే యువకుడు అదే ప్రాంతానికి చెందిన బాలికను అసభ్య పదజాలంతో దూషించడంతో ఆమె తండ్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయగా పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): మండలంలోని భూషణరావుపేటలో పాముకాటుకు గురై మృతిచెందిన గోపిడి రాజు కుటుంబాన్ని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ శుక్రవారం పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని భావిస్తే కేసీఆర్ కుటుంబంలో మాత్రమే అందరికీ పదవులు వచ్చాయన్నారు. పేదప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. బీజేపీ నాయకులు ఎడ్మల వినోద్‌రెడ్డి, పల్లె గంగాధర్, గట్ల కృష్ణ, తుమ్మనపెల్లి మహేశ్, ఎం.డీ సుల్తాన్, అంగిరి ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పంపుసెట్లు చోరీ

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామంలో వారం రోజులనుంచి ఐదు వ్యవసాయ విద్యుత్ పంపుసెట్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. పొలాలు సాగు సమయంలో పంపుసెట్ల చోరీ జరుగుతుండటంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం



నివాళి అర్పిస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలక్రైం/జగిత్యాల రూరల్: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌కు చెందిన తోట శేఖర్ (30) పది రోజుల క్రితం దుబాయ్‌లో మృతిచెందగా శుక్రవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శేఖర్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. ఇక్కడ నాయకులు మారు గంగారెడ్డి, పూర్ణచందర్ రెడ్డి, వేణురావు, మహేశ్, మల్లారెడ్డి ఉన్నారు. కుటుంబ సభ్యుల రోదనల మధ్య శేఖర్ అంత్యక్రియలు నిర్వహించారు.

అక్రమ కేసులతో వేధిస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్ : మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చెగ్యాం మాజీ సర్పంచ్ చెన్న పున్నం వద్ద పనిచేసేందుకు దనిశెట్టి పున్నం ఒప్పందం కుదుర్చుకున్నారని, డబ్బులు తీసుకొని పని చేసేందుకు రాకుండా, చెన్న మల్లయ్య వద్ద పనికి కుదిరాడన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని ఈనెల 5న చెన్న పున్నం, దనిశెట్టి పున్నంను అడిగేందుకు వెళ్లగా గ్రామ బొడ్రాయి వద్ద చెన్న మల్లయ్య, అతని భార్య కలిసి చెన్న పున్నంను విచక్షణారహితంగా కొట్టారన్నారు. ఈ విషయమై చెన్న పున్నం పోలీస్‌స్టేషన్‌లో తొలుత ఫిర్యాదు చేయగా దాడిచేసిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎలాంటి విచారణ లేకుండా చెన్న పున్నంపై హత్యాయత్నం కింద పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని మంత్రి తెలుసుకోవాలని హితవు పలికారు. అక్రమ కేసులపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి పోలీసు ఉన్నతాధికారులతో పాటు, మానవ హక్కుల కమిషన్, హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. సర్పంచ్ మేరుగు మురళి, గోళ్ల తిరుపతి, గుమ్ముల వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

మెట్‌పల్లి: కాంగ్రెస్ నాయకులపై ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కక్షసాధింపు చర్యలు మానుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని వాసవీ గార్డెన్స్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ కాటిపల్లి రాధ కుటుంబం భూ కబ్జాలకు పాల్పడితే అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప ఎమ్మెల్యే దళితులను ఉసిగొల్పి అట్రాసిటీ కేసులు పెట్టించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నుంచి జెడ్పీటీసీ కాంగ్రెస్‌లో చేరడం వల్లే ఎమ్మెల్యే అక్రమ కేసులు పెట్టిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ విషయంలో మాట తప్పిన ఎమ్మెల్యేకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రాధ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వాకిటి సత్యంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన మహిళా సంఘాలకు రుణాలిప్పించాలి



మాట్లాడుతున్న ఏపీఎం రమాదేవి

జగిత్యాలరూరల్: జిల్లాలోని అర్హులైన మహిళా సంఘాలకు బ్యాంక్ రుణాలిప్పించాలని జిల్లా బ్యాంక్ లింకేజీ ఏపీఎం రమాదేవి అన్నారు. శుక్రవారం మండల సెర్ప్ కార్యాలయంలో వీవోఏలకు సెర్ప్ కార్యక్రమాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్యాంక్ లింకేజీలో నెలనెలా టార్గెట్ ప్రకారం ఎంసీపీలు చేసి అర్హులైన సంఘాలకు రుణాలు ఇప్పించాలన్నారు. వీవోఏలు ప్రతి సమాచారం వారి లాగిన్‌లో రెగ్యులర్‌గా ఎంట్రీ చేయాలని, బ్యాంక్ లింకేజీ రుణాలు సక్రమంగా వాయిదాల్లో బ్యాంకుల్లో చెల్లించేలా చూడాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఈజీఎంఎం ద్వారా ఉచిత శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం కూరగాయల విత్తనాల ప్యాకెట్లను మండల సమాఖ్య ఆధ్వర్యంలో వీవోఏలకు పంపిణీ చేశారు. ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, విద్యాసాగర్, రవీందర్, సంతోష్, స్త్రీనిధి మేనేజర్ రాణి, సమాఖ్య కార్యదర్శి భారతి పాల్గొన్నారు.



ఘనంగా ఆషాఢ మాస బోనాలు

కోరుట్ల : పట్టణంలోని శ్రీ దుర్గా ఆలయంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పెండెం గణేశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు టీవీ శేఖర్, మాసం ప్రసాద్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.



వైన్స్ దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం.. జాబితాపూర్‌లోని ముస్కు గోపాల్ రెడ్డికి చెందిన వెంకటసాయి వైన్స్‌లో శుక్రవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గ్రామంలోని వెంకటసాయి వైన్స్‌లో శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలనార్పారు. రూ.2 లక్షల విలువల గల మద్యం దగ్ధమైనట్లు యజమాని తెలిపారు.

కూలిన పాఠశాల ప్రహరీ



కూలిపోయిన గోడ

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల ప్రహరీ శుక్రవారం కొంతమేర కూలింది. రెండేళ్ల క్రితమే సగం వరకు కూలిపోయింది. అయినా యాజమాన్యం పట్టించుకోలేదు. తాజాగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా కూలే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. విష పురుగులు, పాములు తరగతి గదుల్లోకి వస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. పిల్లల రక్షణను నిర్లక్ష్యం చేయకుండా ప్రహరీ నిర్మించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి, పాఠశాల యాజమాన్యం ప్రహరీ నిర్మించేలా ఆదేశించాలని కోరుతున్నారు.